క్లుప్తంగా

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



గద్వాల: హరిహర తనయుని ఊరేగింపు కార్యక్రమం అయ్యప్పస్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం పాతహౌసింగ్ బోర్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా అయ్యప్పస్వామి ఊరేగింపు చేపట్టారు. వాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్వామివార్ల చిత్రపటాలకు పూజలు చేశారు. భక్తుల శరణు ఘోషలు, భజన కీర్తనల మధ్య ఊరేగింపు సాగింది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల అయ్యప్ప మాలధారులు స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్యామప్ప, వైండింగ్ రాములు, గంట రమేష్, శేఖర్, అనిల్, నరహరి శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీహరి, వెంకట్రాములు పాల్గొన్నారు.

నేడు మాచర్లలో వార్షిక గురుపూజ



గట్టు: మండలంలోని మాచర్ల గ్రామంలో శ్రీ సద్గురు పూర్ణానందచంద్రశేఖరాచార్యుల 24వ వార్షిక పాదుక పూజా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆచల గురు మందిర శిష్య బృందం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాచర్లకు చెందిన ఆచల గురుభక్త బృందం వారు శ్రీ పూర్ణానంద చంద్రశేఖరాచార్యుల వార్షిక పాదుక పూజా నిర్వహించనున్నారు. 11 గంటలకు లఘు పూజ, 12 గంటలకు గురుగీతా పారాయణం, ఒంటి గంటకు నగర సంకీర్తన, సాయంత్రం 4 గంటలకు జెండావిష్కరణ, 5 గంటలకు షోడషోపచార మహాపూజ, 6 గంటలకు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, రాత్రి 7 గంటలకు నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల చేత వేదాంత వైజ్ఞానిక మహాసభను నిర్వహించనున్నట్లు నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు మాచర్ల మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నట్లు వారు తెలిపారు.

చేతిపంపు మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని బూడిదపాడు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన చేతి పంపు మరమ్మతు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చేతిపంపు మరమ్మతుకు గురవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. చేతిపంపు వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కనిపించని హరితహారం మొక్కలు



మానవపాడు: తెలంగాణ ప్రభుత్వం 9 హరితహారం కార్యక్రమాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. మానవపాడు మండల కేంద్రం నుంచి గోకులపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుండా గోకులపాడు బ్రిడ్జి నిర్మాణం వరకు హరితహారం మొక్కలకు బదులుగా కంప చెట్లు దర్శనమిస్తున్నాయి. ఇంత వరకు మండల, జిల్లా స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రధాన రహదారి గుండా హరితహారం మొక్కలు నాటక పోవడం, అధికారుల పర్యవేక్షణ లేదని మండల ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి హరితహారం కార్యక్రమం నాటికి మొక్కలు రోడ్ల వెంట నాటేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఉర్సు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లెలో వెలసిన హజరత్ మహబూబ్ హుస్సేని దర్గా ఉర్సు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం గంధోత్సవం, సోమవారం ఉర్సు, మంగళవారం జియారతే ఫాతెహా ఉంటాయన్నారు. గ్రామంలో ఉర్సు క్రమం తప్పకుండా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా వేడుకలు



ధరూర్ పాఠశాలలో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గద్వాలలో కేక్ తీసుకెళ్తున్న చిన్నారులు

అలంపూర్: నూతన సంవత్సర సందడి మొదలైంది. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా నూతన సంవత్సరం గ్రీటింగ్ కార్డుల దుకాణాలు, బేకరీలు, డెకరేషన్ దుకాణాలు, మిఠాయి దుకాణాలు యువతీ యువకులతో సందడిగా మారాయి. యువకులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో, మార్గాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ ఆనందాలను వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నూతన సంవత్సరం వేడుకలు ఆనందంగా చేసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి అపశృతులు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ శాఖ సైతం తగు చర్యలు చేపట్టింది.

అయిజ: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణ, గ్రామీణ ప్రజలు ఉత్సాహంగా వేడుకలకు సిద్ధమయ్యారు. యువత 2023 డిసెంబర్ 31 అర్ధరాత్రి పూర్తవగానే 2024 సంవత్సరానికి స్వాగతం అంటూ కేరింతలు కొడుతూ కేక్‌లు కట్‌చేసి సంబరాలు మొదలెట్టారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాన్సెప్ట్ స్కూల్లో విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశిల, అలంపూర్ చౌరస్తాలో న్యూ ఇయర్‌కు యువత, మహిళలు అధిక సంఖ్యలో కేక్‌లను తీసుకెళ్తున్నారు. అర్ధరాత్రి నుంచి కేక్‌కటింగ్ కోసం ముందుగానే దుకాణాలకు వెళ్లడంతో సందడి నెలకొంది.

మానవపాడు: న్యూ ఇయర్ జోష్‌కు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు 2023కు వీడ్కోలు పలుకుతూ 2024 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు రెడీ అయ్యారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా వ్యాపారులు కేక్‌లు సిద్ధం చేశారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు నందిన్నె, గువ్వలదిన్నె, కొండాపురం, కుచినెర్ల, ఇర్కిచేడు, మైలగడ్డ, వివిధ గ్రామాలల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి యూత్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు.



వెంకటాపురంలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



ఉండవెల్లిలో కేక్‌లు సిద్ధం చేసిన వ్యాపారులు



అలంపూర్‌లో కేక్‌లు సిద్ధం చేస్తున్న వ్యాపారులు

హరిత లక్ష్యం నెరవేరేనా?

- గ్రామాల్లో సిద్ధమౌతున్న నర్సరీలు
- 16 గ్రామాల్లో దాదాపు లక్షన్నరకు పైగా మొక్కలు సిద్ధం
- పూర్తి అవుతున్న బ్యాగ్ ఫీలింగ్ పనులు



చిన్నపోతులపాడు నర్సరీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రమణారావు

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు మండల వ్యాప్తంగా అధికారులు పదో హరితహార కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఆయా గ్రామాల వారీగా హరితహారం కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2023–24 సంవత్సరానికి గానూ మండల వ్యాప్తంగా 16 గ్రామాల పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామానికి 10 వేల చొప్పున 16 గ్రామ పంచాయతీల్లో దాదాపు లక్షా 60వేల మొక్కలను పెంచాలని అధికారులు ప్రణాళికలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మట్టి, ఎరువుల సేకరణ, బ్యాగ్ ఫీలింగ్ పనులు పూర్తవుతున్నాయి. విత్తనాలు, స్టంపులు తెప్పించే ఏర్పాట్లలో అధికారులు ఉన్నారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో నర్సరీలలో మొక్కల పెంపకం పనులకు ఉపాధి హామీ కూలీలను ఉపయోగిస్తున్నారు.

ప్రజలకు అవసరమైన మొక్కలు

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు తెలుసుకుని వాటిని పెంచేందుకు అధికారులు దృష్టి పెడుతున్నారు. దీంతో హరితహారం కింద గ్రామాల్లో అందించే మొక్కలు డిమాండ్ పెరిగింది. దానిమ్మ, నిమ్మ, నేరేడు, పండ్ల మొక్కలతో పాటు పూల మొక్కలను పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

కార్యదర్శులకు అటవీశాఖ శిక్షణ

గతంలో గ్రామ పంచాయతీలకు అటవీశాఖ అధికారులు వారి నర్సరీల్లో పెంచే మొక్కలనే సరఫరా చేసేవారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీల పెంపకం చేపట్టినా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో అటవీశాఖ నర్సరీలకు కార్యదర్శులను పంపించి శిక్షణ ఇప్పించారు.

తుది దశకు బ్యాగ్ ఫీలింగ్ పనులు

హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం ఇప్పటికే బ్యాగుల్లో మట్టిని నింపే పనులు పూర్తి అవుతున్నాయి. మొక్కల పెంపకం కోసం నాణ్యమైన మొర్రం, తగినంత సేంద్రియ ఎరువును కలిపి బ్యాగుల్లో నింపే పనులు చేట్టారు. బ్యాగుల్లో విత్తనాలు నాటుతూ గ్రామ నర్సరీల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

గతంలో ఆశించిన ఫలితాలు లేవు..

9 విడతలుగా చేపట్టిన హరితహారంలో అధికారులు ఆశించిన ఫలితాలు రావడం లేదు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మాత్రమే మొక్కలు నాటారు. కొందరు విద్యుత్ తీగల కారణంగా మొక్కలు తొలగించారు. మరికొందరు వ్యవసాయ పొలాలు దెబ్బతింటాయని తొలగించారు. ఇప్పటికైనా అధికారులు ఆయా గ్రామాల్లో 10వ విడత హరితహారంలోనైనా ఆహ్లాదకరమైన మొక్కల ఏర్పాటుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా..

గ్రామాల్లో నర్సరీ పెంపకం తూతూ మంత్రంగా చేపడుతున్నారు. పండ్ల మొక్కలు, పూల మొక్కలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. హరితహారంలో మొక్కలు నాటామా, ముగిసిందా అనే విధంగా అధికారులు కానిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేటప్పుడు విద్యుత్ తీగలున్న చోటా నాటుతూ, మళ్లీ మొక్కలను తొలగిస్తున్నారు. ఉన్నతాధికారులు హరితహారంలో అన్ని రకాల మొక్కలు నాటించాలి.

– నాగేష్, మానవపాడు

మొక్కల పెంపకానికి కృషి చేస్తాం



మండలంలోని ప్రతి గ్రామంలో నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం. ఒక్కో గ్రామంలో 10వేల మొక్కలు సిద్ధం చేస్తున్నాం. మండల వ్యాప్తంగా మొత్తం 1.60లక్షల మొక్కల ఏర్పాటుకు కృషి చేస్తాం. క్షేత్రస్థాయిలో అధికారులు సహకారంతో పనులు చేపడతాం. ప్రతి గ్రామంలో మొక్కల పెంపకానికి కృషి చేస్తాం.

– లాల్‌నాయక్, ఏపీఓ, మానవపాడు

మట్టి ఆధారంగా..



ప్రజల డిమాండ్ మేరకు వారు కోరిన మొక్కల పెంపకం కోసం ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే బ్యాగుల్లో మట్టి నింపే పనులు పూర్తయ్యాయి. విత్తనాల సేకరణ చేయాలని కార్యదర్శు కు సూచించాం. విత్తనాలు రాగానే ప్రాసెసింగ్ చే యించి నాటే కార్యక్రమం చేపడతాం. గ్రామంలో పదివేలకు పైగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రమణారావు, ఎంపీడీఓ

పశుగ్రాసం కోసం పరేషాన్..

- వరికోతలకు యంత్రాల వినియోగం
- గడ్డి ముక్కలవ్వడంతో నిల్వ చేసేందుకు ఇబ్బందులు
- ట్రాక్టర్ వరిగడ్డి రూ.13 నుంచి 15 వేలు పలుకుతున్న వైనం
- నియోజకవర్గంలో మొత్తం 1,08,422 పశువులు
- పశువులకు మేతలేక పాడి రైతుల అవస్థలు



ఎర్రవల్లిలో వరి పంటను కోస్తున్న హార్వెస్టర్

ఎర్రవల్లిచౌరస్తా: వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక పశువులకు గడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే పెరిగినా వరిగడ్డి మాత్రం దొరకడం లేదు. దీనికి ముఖ్య కారణం వరి కోతలకు కూలీలకు బదులుగా యంత్రాలను ఉపయోగించడమే. యంత్రాల ద్వారా వరిని కోయడం వల్ల గడ్డి మొత్తం ముక్కలుగా రావడంతో కట్టలు కట్టడానికి వీలు లేకపోవడంతో రైతులు గడ్డిని నిల్వ చేయలేకపోతున్నారు. వరి పంట వేసిన గ్రామాల్లో కూలీల కొరతతో పాటుగా ఖర్చులు కూడా అధికమవ్వడంతో రైతులు వరికోతలకు యంత్రాల వినియోగం పెరిగింది. బోరు మోటర్లు, చెరువుల దగ్గర వరిని సాగు చేసిన రైతులు యంత్రాలతో వరి కోతలను చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతోందని రైతులు భావిస్తున్నారు. దీనివల్ల పశువులకు మాత్రం వరిగడ్డి దొరకడంలేదు. కూలీలతో వరి కోతలు చేపడితే గడ్డి ఇబ్బడి, ముబ్బడిగా ఉండేది. గడ్డిని నిల్వ చేసుకునేందుకు కూడా అనుకూలంగా ఉంటుంది. పశుగ్రాసం కొరతతో తప్పని పరిస్థితుల్లో ఆ గడ్డిని ఆయకట్టు రైతులే నిల్వ ఉంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో నీటి వనరులు లేని రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలోని పాడి పశువుల వివరాలు..	
పశువులు	56,298
గేదెలు	52,124
మొత్తం	1,08,422

గడ్డి ఎక్కువగా నిల్వ ఉండాలంటే..

యంత్రాలతో గడ్డిని కోసిన తర్వాత కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకుంటే ఏడాదిపాటు గడ్డి సులభంగా నిల్వ ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. పొలంలో యంత్రం ద్వారా కోసిన గడ్డిని పనలుగా సేకరించి ఒక్కో పనను గట్టిగా కట్టాలి. అనంతరం ఆ పనలను ఒక ప్రాంతానికి చేర్చి గడ్డిమేటు వేయాలని చెబుతున్నారు. గడ్డిమేటు వేసే సమయంలో పైకప్పు ఏటవాలుగా ఉండేలా చేసుకొని పైన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ కవర్లను తప్పకుండా కప్పి ఉంచాలి. దీనివల్ల వర్షాకాలంలో గడ్డిలోకి నీరు వెళ్లకుండా ఉండటంతో పాటు ఎక్కువ రోజులు గడ్డి నిల్వ ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

గడ్డి దొరకడంలేదు



ప్రస్తుత కాలంలో యంత్రాలతో వరి కోతలను చేపట్టడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూ లీల ద్వారా కోత కోసిన గడ్డి నిల్వ చేసేందుకు వీలుగా ఉండేది. ప్రస్తుతం ఆయకట్టేతర ప్రాంతాలకు పశుగ్రాసం దొర కడం చాలా కష్టంగా మారింది.

– కుర్వ నరసింహ, పాడి రైతు, కారుపాకుల

యంత్రాలు కోసిన గడ్డి తినడంలేదు



కూలీల కొరత వల్ల రైతులు యంత్రాల ద్వారానే వరి కోతలు కోస్తున్నారు. యంత్రాలతో కోసిన గడ్డి చిన్న చిన్న ముక్క లుగా రావడంతో నిల్వ చేయడానికి పనికి రాకుండా పోతుంది. యంత్రాలతో కోసిన గడ్డిని పశువులు తినడం లేదు.

– గుమ్మడం లక్ష్మన్న, రైతు, వీరాపురం

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని సమస్యలను ఎమ్మెల్సీ చల్లా సహకారంతో పూర్తి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అన్ని మండలాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయని, వాటన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫన్ గేమ్స్




అలంపూర్ మాంటిస్సోరిలో మ్యాజిక్ షో

అలంపూర్: నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వింటర్ ఫెస్ట్ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో మూడు రోజులుగా వింటర్ ఫెస్ట్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వింటర్ ఫెస్ట్ మూడో రోజు ఫన్ గేమ్స్, మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కేఎస్‌వీ రవిప్రకాష్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఫన్ గేమ్స్, మ్యూజిక్ షోలను ప్రారంభించారు. చాంద్ బాషా మ్యాజిక్ షోతో విద్యార్థులను ఉల్లాసపరిచారు. హైదరాబాద్ నుంచి వచ్చిన చరణ్ డాన్సింగ్ డాల్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కట్టెలే రక్షణగా..

జిల్లా కేంద్రంలో పాతహౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని పీజేపీ కుడి కాల్వ వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నుంచే నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. రక్షణ గోడలు తొలగిపోవడంతో కట్టెలను ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆదమరిస్తే కాల్వలో పడే ప్రమాదం పొంచి ఉంది. పక్కనే నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులు కొనసా...గుతూనే ఉన్నాయి. త్వరితగతిన పనులు పూర్తి నూతన వంతెనను అందుబాటులోకి తీసుకోరావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దృశ్యం శనివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల అర్బన్



శిథిలావస్థకు చేరిన పీజేపీ కుడి కాల్వ వంతెన



అసంపూర్తిగా నూతన వంతెన పనులు

ఇరుకు గదుల్లో పశువైద్యం



- మౌలిక వసతులు కల్పించండి
- శిథిలమైన ప్రహరీ
- అపరిశుభ్రంగా పరిసర ప్రాంతం

అయిజ: పట్టణంలోని పశువైద్యశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురికావల్సివస్తోంది. మండలంలో, మున్సిపాలిటీలో మొత్తం ఎద్దులు 9,320, ఆవులు 3585, గొర్రెలు, మేకలు 80,755 ఉన్నాయి. పశువైద్యశాలలో (వీఏఎస్) వెటనరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి పని చేస్తున్నారు. పశువులకు వైద్యసేవలు చేయించేందుకు ప్రతిరోజు గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు, ఎద్దులను పశుపోషకులు పశువైద్యశాల వద్దకు తీసుకొస్తుంటారు. పశువైద్యాధికారిని, సిబ్బంది వైద్యసేవలందిస్తుంటారు. మున్సిపాలిటీలోని పశువైద్యశాలకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో వైద్యులు, సిబ్బంది, రైతులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. పశువైద్యశాల భవనంలో ఒక చిన్నగదిలో పశువైద్యాధికారిని విధులు నిర్వహిస్తున్నారు. మరొక గదిలో పశువైద్యశాల ఫర్నీచర్, మందులు, సబ్సిడీ దాన తదితర వస్తువులు పెట్టుకోవాల్సి వస్తుంది. పశువైద్యశాల భవనం పక్కన, వెనక భాగంలో ముళ్ల పొదలు ఉండడంతో పాములు, తేళ్లు తరుచూ పశువైద్యశాలలోకి వస్తుండడంతో సిబ్బంది బయాందోళనకు గురవుతున్నారు. భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రహరీ కూలిపోతే పందులు లోపలికి వచ్చే అవకాశం ఉంది. భవనం ముందు ఖాళీ స్థలం లేకపోవడంతో పశువులకు వైద్య సేవలందించేందుకు పశువైద్యాధికారికి, సిబ్బందికి ఇబ్బంది ఏర్పడింది. భవనం పరిసర ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. నూతన భవనం నిర్మించడానికి స్థలం లేకపోవడంతో అనువైన ప్రదేశంలో మౌలిక వసతులతో కూడిన భవనాన్ని నిర్మించాలని రైతులు కోరుతున్నారు. మౌలిక వసతులు కలిగిన భవనం నిర్మించి, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇరుకుగా ఉంది..



పశువులకు రోగాలు వస్తే పభుత్వం పశువుల దవాఖానకు తీసుకపోతాం. దవాఖాన ముందు స్థలం లేకపోవడంతో ఒకదాని తర్వాత మరొక పశువును కాంపౌండ్‌లోకి తీసుకపోవాలి. పశువులను బయట నిలబెడుదామంటే అది బస్టాండ్‌కు పోయే మెయిన్‌రోడ్డు, ఆటోలు, జీపులు, మోటార్‌సైకిళ్లు వస్తుంటా యి. స్థలం పెద్దగా ఉన్నచోట పశువుల దవాఖాన కడితే బాగుంటది

– నరసింహులు, రైతు, అయిజ.

కొత్త భవనం నిర్మిస్తే బాగుంటుంది



ఇప్పుడున్న పశువుల దవాఖాన చిన్నదిగా ఉంది. అక్కడ పశువులకు వైద్యం చేయించడానికి ఇబ్బందిగా ఉంది. ఎలాంటి వసతులు లేవు. పాత భవనం కూల్చివేసి కొత్త భవనం కడితే బాగుంటుంది. కొత్త పరికరాలు తెప్పించి, సిబ్బందిని ఎక్కువగా పెట్టి పశువులకు వైద్యం చేయాలి.

– దేవన్న, వేణిసోంపురం

అనేక సమస్యలు ఎదుర్కొటున్నాం



పశువైద్యశాల భవనం ఇరుకుగా ఉండడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన వస్తోంది. మండలంలోని పులికల్‌లో ఏర్పాటు చేసిన ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌కు వైద్యులు లేరు. ఉప్పలలో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న వైద్యుడు, అటెండర్ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాను. సమస్యల గురించి ఉన్నతాధికారులకు నివేదించాం.

– స్వరూపారాణి, పశువైద్యాధికారిని, అయిజ

మత సామరస్యానికి ప్రతీక

పాన్‌గల్: మండల కేంద్రం సమీపంలోని బాలపీర్లా దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం వారు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాను ముస్లింలతో పాటు హిందూవులు పెద్ద సంఖ్యలో దర్గాను దర్శించుకుంటారన్నారు. కార్యక్రమంలో కురుమూర్తియాదవ్, చంద్రయ్యయాదవ్, తిరుమల్‌యాదవ్, కౌన్సిలర్లు కృష్ణ, కంచెరవి, తిరుపతయ్యసాగర్, రాములుయాదవ్, బీరయ్యయాదవ్, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.